
ఎన్నాళ్లీ చీకట్లు?



అనంతగిరి, న్యూస్‌టుడే: మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గుమ్మకోట పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన గిరిజనులు గురువారం సాయంత్రం కాగడాలతో ఆందోళన చేపట్టారు. వీరంతా వ్యవసాయ పనుల నిమిత్తం సుమారు ఆరేళ్ల క్రితం గ్రామం నుంచి బయటకు వచ్చి కొంత దూరంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి తమకు మంచినీరు, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు వసతులు సమకూర్చాలని కోరుతున్నారు.

కారణజన్ముడు వాల్మీకి మహర్షి



కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీఓ అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మావతి నివాళులు

పాడేరు, న్యూస్‌టుడే: మహాకవి వాల్మీకి మహర్షి జయంతిని గురువారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్ఓ పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ తదితరులు మాట్లాడుతూ.. రామాయణాన్ని రచించిన వాల్మీకి ఎన్నో విషయాలపై మహత్తర సందేశాన్ని అందించారని పేర్కొన్నారు. ఆయన కారణజన్ముడని కొనియాడారు.

★ ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఓ ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, ఐటీడీఏ ఏఓ శ్రీనివాస్‌కుమార్, కలెక్టరేట్ ఐటీడీఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహా వెలుగులు..



మన్యానికి మణిహారమైన పాడేరు వైద్య కళాశాల రాత్రి వేళలో విద్యుత్తు వెలుగుల్లో ధగధగలాడుతోంది. సుమారు రూ. 500 కోట్లతో నిర్మించిన ఈ కళాశాలను ఈ నెల 14న కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఇక్కడ 50 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా.. ఇప్పటికే 42 భర్తీ చేశారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. – పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

తాడే ఆధారం.. ప్రాణాలు పణం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న జోలాపుట్టు జలాశయం పరిధిలో విస్తరించి ఉన్న మత్స్యగెడ్డలో ఏటా పడవ ప్రమాదాలు జరిగి గిరిజనులు మృత్యువాత పడుతున్నారు. గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్లు, మత్స్యగెడ్డపై వంతెనల నిర్మాణాలు జరగకపోవడంతో గిరిజనులు నాటుపడవలను ఆశ్రయిస్తున్నారు. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు.. వేరే గ్రామానికి, పొలాలు, అటవీ భూములకు, వారపు సంతలకు వెళ్లేందుకు నాటుపడవలను ఆశ్రయించి ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఇరవై ఏళ్లలో జరిగిన పడవ ప్రమాదాల్లో 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ముంచంగిపుట్టు మండలంలోని పనసపుట్టు, సుజనకోట, ఏనుగురాయి, దారెల, పెదగుడ పంచాయతీల్లోని 48 గ్రామాలు మత్స్యగెడ్డ పరివాహకంలో ఉన్నాయి.

సుజనకోట పంచాయతీలోని 14 గ్రామాలు మత్స్యగెడ్డ పరివాహకంలో ఉన్నాయి. ఆ గ్రామాల ప్రజలు మత్స్యగెడ్డపై రాకపోకలు సాగించేందుకు కుమ్మరిపుట్టు వద్ద నాటుపడవలను ఆశ్రయిస్తున్నారు. పడవలు శిథిలమై, రంధ్రాలు పడి లోపలకు నీరు చేరుతుండటంతో తాడు ఆధారంగా వీటిని నడుపుతున్నారు. ప్రమాదమని తెలిసినా పడవపై రాకపోకలు సాగిస్తున్నారు. రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు సుజనపేట వద్ద కల్వర్టు కూలిపోవడంతో ప్రజలు నాటుపడవలను ఆశ్రయిస్తున్నారు. కుమ్మరిపుట్టు వద్ద కాలిబాట వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రవాణా సేవలు దూరమై..

దారెల పంచాయతీలోని పెదపేట, పేటమాలిపుట్టు, కుమ్మరిపుట్టు, డొక్రిపుట్టు, మురళిపుట్టు, రంగిలిసింగి గ్రామాలు మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో రైతులు, గిరిజనులు రాకపోకలు సాగించేందుకు రోడ్డు, రవాణా సేవలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో పెదపేట సమీపంలో నాటుపడవలను ఆశ్రయిస్తున్నారు. పెదపేట, రోగులపేట మధ్య వంతెన నిర్మిస్తే కేవలం ఒక కి.మీ. దూరం ప్రయాణించి పెదబయలు వెళ్లొచ్చు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టక ప్రజలు నాటుపడవలను ఆశ్రయించి ప్రమాదాలకు గురవుతున్నారు. పెదపేట నుంచి మురళిపుట్టు వరకు, దారెల నుంచి పెదగుడ వరకు రోడ్డు నిర్మించి బస్సు సదుపాయం కల్పిస్తే ప్రజలు రవాణా సేవలు మెరుగవుతాయి.





మత్స్యగెడ్డలో పడవపై ప్రయాణం చేస్తున్న గిరిజనులు

ఏం చేస్తే ప్రయోజనం..

★ సుజనకోట పంచాయతీలోని కుమ్మరిపుట్టు వద్ద తాడు ఆధారంగా నడిపే పడవలకు బదులుగా ఇంజిన్‌బోట్లు ఏర్పాటు చేయాలి. కుమ్మరిపుట్టు నుంచి ముంచంగిపుట్టు వచ్చే మార్గంలో మత్స్యగెడ్డపై కాలిబాట వంతెన నిర్మించాలి.

★ పెదపేట సమీపంలో రోగులపేటకు వెళ్లే మార్గంలో మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలి.

★ మత్స్యగెడ్డ పరివాహక గ్రామాల్లో ప్రజలు రాకపోకలు సాగించేందుకు స్టీమర్ పడవలు ఏర్పాటు చేయాలి.

గతంలో జరిగిన ప్రమాదాలు

- ★ పెదపేట సమీపంలో నాటుపడవ మునిగి ఇద్దరు మహిళలతోపాటు ముగ్గురు మృతి చెందారు.
- ★ కుమ్మరిపుట్టులో ఆరుగురు చిన్నారులు మత్స్యగెడ్డలో మునిగి చనిపోయారు.
- ★ కుమ్మరిపుట్టు వద్ద పడవ మునిగి ఉపాధ్యాయుడు మృతి చెందాడు.
- ★ ఏనుగురాయి పంచాయతీలోని కుంబిగుడ వద్ద వ్యవసాయ పనులకు వెళ్లి వస్తూ మత్స్యగెడ్డలో పడవ బోల్తా పడి ఐదుగురు గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు.
- ★ పెదగుడ పంచాయతీలో గలగండ వద్ద రెండుసార్లు పడవ ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు.



మత్స్యగెడ్డలో పడవ మునక.. యువకుడి గల్లంతు

ముంచంగిపుట్టు, పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: దారెల పంచాయతీ పెదపేట సమీపంలోని మత్స్యగెడ్డలో గురువారం నాటుపడవ మునిగి కొర్రా వేణుగోపాలస్వామి (24) గల్లంతయ్యాడు. పెదబయలు మండలంలోని సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన వేణుగోపాలస్వామి వ్యవసాయ పరికరాలకు సాన పట్టించేందుకు మత్స్యగెడ్డలో నాటుపడవపై ముంచంగిపుట్టు మండలంలోని పెదపేట గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఉద్ధృతంగా నీటి ప్రవాహం ఉన్న మత్స్యగెడ్డలో ఒంటరిగా పడవపై వెళ్తుండగా దట్టమైన గాలులు వీచి నీటి కెరటాల వేగం పెరగడంతో పడవ బోల్తా పడిందని పేర్కొన్నారు.

పెళ్లయిన రెండేళ్లకే..

వేణుగోపాలస్వామికి వివాహమై రెండేళ్లయిందని భార్య లక్ష్మి, బంధువులు విలపించారు. భీమన్న, సీతమ్మలకు వేణుగోపాల్‌స్వామి ఒక్కడే కుమారుడు. పడవ ప్రమాదంలో గల్లంతైన కుమారుడి ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. రోగులపేట, పెదపేట గ్రామస్థులు, గిరిజన మత్స్యకారులు నాటుపడవల సహాయంతో గాలింపు చేపడుతున్నారు. సీతగుంట సర్పంచి మాధవరావు, గ్రామస్థులు చేరుకుని సహకారం అందిస్తున్నారు. తహసీల్దార్ నర్సమ్మ, ఎస్సై రవీంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సమాచారాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామని, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పంపిస్తామని ఆయన చెప్పారని తహసీల్దార్ తెలిపారు.

ఇన్నాళ్లూ కళ్లకు గంతలు.. వ్యయం రెండింతలు

★ భారీగా పెరిగిన పోలవరం ఎడమ కాలువ పనుల విలువ

★ కూటమి సర్కారు చొరవ.. రూ.379 కోట్లతో 6(ఎ) ప్యాకేజీ



ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, ఎలమంచిలి

పోలవరం ప్రధాన ప్రాజెక్టునే నిర్లక్ష్యం చేసిన వైకాపా సర్కారు వాటి కాలువలను సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎడమ కాలువ పనులు అయిదేళ్ల నుంచి అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఉన్న 52.189 కిలోమీటర్ల పొడవున కాలువ పనులు చేపట్టారు. జగన్ కొలువుదీరిన తర్వాత అప్పటికే తవ్విన కాలువ మట్టిని ఆ పార్టీ నాయకులు అమ్మేసుకున్నారు. ఏళ్ల తరబడి పనుల్లో కదలిక లేకపోవడంతో అంచనా విలువలు భారీగా పెరిగిపోయాయి. దీంతో కూటమి సర్కారు అన్ని ప్యాకేజీలు ఒకేసారి కాకుండా దశలవారీగా వాటిని పూర్తిచేయాలని నిర్ణయించింది. కొత్త అంచనా విలువలతో అయిదు, ఆరు ప్యాకేజీల్లో మిగిలిపోయిన పనులను పట్టాలెక్కించడానికి చకచకా చర్యలు తీసుకుంటోంది. తద్వారా రైతులకు సాగునీరు, విశాఖ నగరానికి తాగునీరు ఇవ్వడానికి చొరవ చూపుతోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు నెలల క్రితం ఎస్.రాయవరం మండలంలో పర్యటించారు. అసంపూర్తి పనులను పరిశీలించారు. వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం దార్లపూడి వరకు 6, 6(ఎ) ప్యాకేజీ, దార్లపూడి నుంచి కశింకోట మండలంలోని తాళ్లపాలెం వరకు ఏడో ప్యాకేజీ పనులు చేయాలి. ఆరో ప్యాకేజీ దాదాపు పూర్తయ్యాయి. 6(ఎ) పనులు కేవలం 9.43 శాతం మాత్రమే జరిగాయి. ఇదివరకు రూ. 152 కోట్ల అంచనా వ్యయంతో గుత్తేదారుకు పనులు అప్పగించారు. గత ప్రభుత్వంపై నమ్మకంలేక వారు పనులు చేయకుండా వదిలేశారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేసి తాజాగా అంచనాలు సవరించి కొత్తగా టెండరు పిలిచారు. కొత్త రేట్ల ప్రకారం 6(ఎ) ప్యాకేజీ పనుల అంచనా విలువ ఇప్పుడు రూ. 379 కోట్లకు పెరిగిపోయింది. కాలువ పొడవులో 111 కి.మీ నుంచి 136 కి.మీ వరకు ప్రధాన కాలువ తవ్వి ఇరువైపులా సిమెంటు లైనింగ్, ఇతర సీసీ పనులు చేయాలి. మధ్యలో కొన్ని చోట్ల వంతెనలు, అప్రోచ్ రోడ్లు నిర్మించాలి. ఈ పనుల విలువ రెండింతలు పెరిగింది.



కాలువ పైవంతెన పనులు ఇలా..

మిగతా ప్యాకేజీల్లోను అసంపూర్తే..

★ ఆరో ప్యాకేజీలో రూ. 125.92 కోట్ల పనులకు గాను రూ. 117.58 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా ఏడు శాతం పనులు చేయాలి. వీటి అంచనాలు సవరిస్తే మరింత వ్యయం పెరగనుంది.

★ ప్యాకేజీ-7లో రూ. 330 కోట్ల అంచనా విలువగల పనిలో రూ. 278 కోట్ల పని పూర్తిచేశారు. మొత్తం పనిలో 84 శాతం జరిగినా ఇంకా 16 శాతం పనుల్లో కదలిక లేకుండా పోయింది.

★ ఎనిమిదో ప్యాకేజీలో రూ. 113 కోట్ల పనికి గాను రూ. 32 కోట్ల పని మాత్రమే జరిగింది. దీనికి సంబంధించి గుత్తేదారు సంస్థతో ఒప్పందాన్ని రద్దుచేసుకున్నారు. మిగిలిన పనులకు సంబంధించి కొత్త అంచనా విలువతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

వాగుపై వంతెన నిర్మించరూ.. ఎమ్మెల్యేకు గిరిజనుల మొర

దేవీపట్నం, న్యూస్‌టుడే: దేవీపట్నం మండలం వి.రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని వెలగపల్లి- గుంపెనపల్లి గ్రామాల మధ్య ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సీతపల్లి వాగును పరిశీలించి ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి గురువారం పరిశీలించారు. వాగు వద్ద ఉన్న గుంపెనపల్లి, లక్ష్మీపురం గ్రామాల గిరిజనులు మాట్లాడుతూ వర్షాకాలం మూడు నెలలపాటు వాగు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకి వివరించారు. వాగుపై వంతెన ఏర్పాటు చేయాలని కోరారు. చొప్పకొండ, పాముగండి, డి.ఎన్.పాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు వెళ్లే కొండ రహదారులు అధ్వానంగా మారాయని రహదారి సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచి కోసు లచ్చన్నదొర ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.



వెలగపల్లి వద్ద సీతపల్లి వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీషా దేవి

ఎమ్మెల్యే వెంట ఏలేటి కృష్ణమోహన్, ధర్మరాజు, సత్యం రాజు తదితరులు ఉన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తెదేపా సీనియర్ నేత మాజీ ఎంపీపీ భర్త కోండ్ల చినకొండారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు.

ప్రాణనష్టం జరిగే వరకు పట్టదా?

అరకులోయ నుంచి పాడేరు మార్గంలోని బురదగెడ్డ వంతెన వద్ద రహదారి బాగా



కోతకి గురై ప్రమాదాలకు నిలయంగా మారింది. రాత్రివేళ ఇక్కడ ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీ ప్రమాదాలు జరిగే ముప్పు ఉంది. ఈ ప్రదేశంలోనే గతంలో ఆటో వంతెన నుంచి కిందకు జారిపోవడంతో పలువురు తీవ్రగాయాలపాలయ్యారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?, ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు స్పందించరాని అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

–అరకులోయ, న్యూస్‌టుడే

విదేశీ పర్యటకుల సందడి



ఒనకఢిల్లీ వారపు సంతలో ..

మన్యానికి విదేశీ పర్యటకుల తాకిడి మొదలైంది. ఏటా శీతాకాలంలో విదేశీయులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. ఒనకఢిల్లీ వారపు సంతకు వచ్చే బోండా, గదబ గిరిజన మహిళల సంప్రదాయ వస్త్ర ధారణ, ఇతర విషయాలు తెలుసుకుంటుంటారు. గురువారం పలు దేశాల నుంచి పర్యటకులు వారపు సంతను సందర్శించారు.

– ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే

ఎలుగుబంటి దాడి.. ముగ్గురికి గాయాలు



గాయపడిన గిరి మహిళ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గుంటగన్నెల పంచాయతీ పిత్తగుడ గ్రామంలోని కాఫీ తోటల్లో ఎలుగుబంటి దాడిలో ముగ్గురు గిరిజనులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కిల్లో లక్ష్మి, కిల్లో కేశవరరావు, ఇతడి భార్య గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో కాఫీ తోటల పనులకు గురువారం ఉదయం వెళ్లారు. ఎలుగుబంటి వీరిపై దాడి చేసింది. గాయాలతో పరుగుపరుగున గ్రామానికి చేరుకున్నారు. కుటుంబసభ్యులు వీరిని హుటాహుటిన అంబులెన్సులో డుంబ్రిగుడ పీహెచ్‌సీకి, అక్కడి నుంచి అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

సబ్బుల కథ 'కల్పనే'నా!

ఎండీ చెప్పినా పట్టాలెక్కని జీసీసీ యూనిట్

ఈనాడు, పాడేరు - న్యూస్‌టుడే, అరకులోయ

అరకులోయలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సబ్బుల తయారీ యూనిట్ నాలుగేళ్లుగా మూతపడింది. రెండు మాసాల క్రితం అరకులోయ వచ్చిన జీసీసీ ఎండీ కల్పనా కుమారి ఈ యూనిట్‌ను పరిశీలించారు. పరిస్థితులపై అధ్యయనం చేసి పది రోజుల్లో దీన్ని పునః ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఆమె హామీతో సిబ్బంది ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇంతవరకు ఇది ప్రారంభానికి నోచుకోలేదు.

అరకులోయ యూనిట్‌లో సుమారు 30 మంది కార్మికులు ప్రత్యక్షంగా పనిచేస్తున్నారు. విజయనగరంలోనూ జీసీసీ సబ్బుల తయారీ యూనిట్ ఉంది. అరకులోయ యూనిట్ మూతపడగా.. విజయనగరంలోని కేంద్రం మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. ఈ యూనిట్‌తో పరోక్షంగా అనేక మంది లబ్ధి పొందుతున్నారు. ఇక్కడి కార్మికులను గతేడాది ముంబయి పంపించి శిక్షణ సైతం అందించారు. ఇక్కడ తయారయ్యే సబ్బులను తెదేపా ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేవారు. విద్యార్థులకు అందించే కాస్మెటిక్స్ ఛార్జీల నుంచి ఆ సొమ్మును తిరిగి జీసీసీకి నిర్వాహకులు చెల్లించేవారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కాస్మెటిక్ ఛార్జీలు ఇవ్వకుండా అమ్మఒడి రూపంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లోనే సొమ్ము వేశారు. ఇవి జీసీసీకి చేరక సబ్బుల పంపిణీ ఆగిపోయింది. జీసీసీలో తయారైన సబ్బులకు బహిరంగ మార్కెట్‌లో అంతగా ప్రాచుర్యం లేదు. వసతిగృహాలకు సైతం సరఫరా నిలిచిపోవడంతో తయారీ ఆపేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేక చొరవ చూపించి వసతిగృహాలకు ఈ సబ్బులను సరఫరా చేయిస్తే యూనిట్ తిరిగి పట్టాలెక్కే అవకాశం ఉంది. దీంతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా బహిరంగ మార్కెట్‌లో పోటీ ఇచ్చేలా ఇక్కడ సబ్బులను తయారు చేయాల్సి ఉంది. జీసీసీ ఉన్నతాధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అరకులోయలోని జీసీసీ సబ్బుల తయారీ యూనిట్



సబ్బుల తయారీ యూనిట్‌ని రెండు మాసాల క్రితం పరిశీలించిన జీసీసీ ఎండీ కల్పనాకుమారి

బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య పాఠశాలల్లో అతిథి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో అభిషేక్ తెలిపారు. సీబీఎస్‌ఈ సిలబస్ బోధించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను పాడేరు ఐటీడీఏ గురుకులం సెల్‌కు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94937 58072, 94938 45498 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి శిక్షణ దోహదం



మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, చిత్రంలో ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ పాలన, నిబంధనలపై ప్రజాప్రతినిధులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం చింతపల్లి మండల పరిషత్ సమావేశం మందిరంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీవో ఆశాజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పాలన, అభివృద్ధి చేసేందుకు ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. పంచాయతీ నిధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి శస్త్రచికిత్సకు తరలిస్తున్నవారితో వైద్య సిబ్బంది

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో గురువారం లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు దినేష్, రమణ శిబిరంలో సేవలందించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన 10 మందిని విశాఖపట్నం తరలించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు 2,771 దరఖాస్తులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు ప్రక్రియ ముగిసింది. జులై 29 నుంచి ఈ నియోజకవర్గంలో ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. సెప్టెంబరు 3 వరకు కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఫారం-19 ద్వారా ఓటుకు దరఖాస్తులు స్వీకరించారు. 14,191 మంది దరఖాస్తు చేయగా, పరిశీలించి 13,677 మందికి ఓటుహక్కు కల్పించారు. గతనెల 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అప్పటి నుంచి ఈనెల 15 వరకు అర్హుల నుంచి మరోసారి దరఖాస్తులు, ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కొత్తగా 2,771 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపైన, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈనెల 30లోగా విచారణ నిర్వహిస్తారు. నవంబరు 6న తుది జాబితా ప్రచురిస్తారు. 2021 మార్చిలో ఈ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికలకు పీడీఎఫ్ అభ్యర్థిగా షేక్‌సాబ్జీ విజయం సాధించారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. నవంబరు, డిసెంబరులో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గెలిచిన అభ్యర్థికి 2027 మార్చి వరకే పదవీ కాలం ఉంటుంది. 2021లో జరిగిన ఎన్నికల్లో 17వేల మందికి పైగా ఓటర్లు ఉండగా, ఈసారి ఈ సంఖ్య తగ్గనుంది. తుది జాబితాలో 15వేల పైచిలుకు ఓట్లు మాత్రమే ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులు, ముసాయిదా జాబితా అభ్యంతరాలపై విచారణ పూర్తి చేసి, నవంబరు 6న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్ న్యూస్‌టుడేకు తెలిపారు. కొత్తగా అల్లూరి సీతారామరాజులో 131 దరఖాస్తులు వచ్చాయి.



నాస్కామ్ సహకారం.. అంకురాలకు శ్రీకారం

ఈనాడు, విశాఖపట్నం

అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కారం..

ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ప్రాజెక్టుల



1 ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నెలకొల్పిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా దీన్ని ఏర్పాటుచేశాయి. సీవోఈ సహకారంతో నెలకొల్పిన అంకుర సంస్థలు అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కారాలు చూపుతున్నాయి. ఆ ప్రాజెక్టులను వైద్యారోగ్య, విద్య, తదితర శాఖల్లో ప్రయోగాత్మకంగా చేపట్టారు. ప్రభుత్వ సహకారం అందిస్తే పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు వీలుంటుందని అంకుర సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

మందులు సమయానికి తీసుకునేలా..

2 గర్భిణులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా ఔషధాలు వాడాలి. రోగులు సమయానికి మందులు వాడుతున్నారా.. లేదా.. పర్యవేక్షించేందుకు ఓ అంకుర సంస్థ 'పిల్‌బాక్స్ రిమైండర్' అనే ప్రాజెక్టును రూపొందించింది. ఒక డబ్బాలో మాత్రలన్నీ పెడితే.. సాంకేతిక సహాయంతో మందులు వేసుకోవాల్సిన సమయానికి అలర్ట్ వస్తుంది. అప్పుడు డబ్బా తెరిచి, మందులు వేసుకున్నారా.? లేదా? అనే వివరాలు కూడా తెలుసుకోవచ్చు. దీన్ని విశాఖ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుచేశారు. దీన్ని విశ్లేషించి అవసరమైన మార్పులు సూచిస్తే, పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అంకుర సంస్థ యజమాని ఎం.శ్రీనివాస్ చెబుతున్నారు.



అంకుర సంస్థ రూపొందించిన 'ఔషధాల డబ్బా'

గర్భిణులను పరీక్షించేందుకు..

గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ఆరోగ్య కేంద్రాలకు వచ్చేందుకు సంకోచిస్తుంటారు. దీంతో ఆశా కార్యకర్తలు అన్ని యంత్రాలు మోసుకెళ్లి బీపీ, తదితరాలు పరీక్షిస్తుంటారు. 'సేవ్ మామ్' అనే అంకుర సంస్థ చేతిలో ఇమిడే పరికరాన్ని తీర్చిదిద్దింది. దీంతో సులభంగా గర్భిణుల్లో బీపీ, గుండె స్పందన, ఆక్సిజన్‌స్థాయిలు, ఉష్ణోగ్రత తెలుసుకోవచ్చు. దీని ద్వారా 3 నెలపాటు 3000 మంది గర్భిణులను పరీక్షించారు. ఆ వివరాలను ఆసుపత్రుల్లోని యంత్రాల్లో పరీక్షించిన విలువలతో సరిపోల్చగా 98 శాతం కచ్చితత్వం కనిపించింది. ఆరోగ్యశాఖ ఆ సాంకేతికత బాగుందని ధ్రువపత్రం ఇవ్వగా.. ఆ సంస్థ తమిళనాడులో భారీ ప్రాజెక్టు కైవసం చేసుకుంది.

టెలీ పాథాలజీ సేవలు..

3 కణజాలం, ఇతర కీలక పరీక్షలు చేసేందుకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సరైన సదుపాయాలు లేవు. పాథాలజిస్టులు లేకపోవడంతో రోగులు జిల్లా కేంద్రాసుపత్రులకు అనకాపల్లి లేదా విశాఖ వెళ్లాల్సి ఉంటుంది. దీంతో చాలా మంది రోగులు ఆ పరీక్షలు చేయించుకోవట్లేదు. దీనికి పరిష్కారంగా ఓ అంకుర సంస్థ 'టెలీ పాథాలజీ' అనే సదుపాయాన్ని అభివృద్ధి చేసింది. వైద్యారోగ్యశాఖతో కలిసి అనకాపల్లి జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో దీన్ని పరీక్షించారు. అవసరమైన పరికరాలు సమకూర్చి, టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. దీంతో రోగులకు పరీక్షలు చేసి, ఆ వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు.

- జిల్లా కేంద్రాసుపత్రిలోని పాథాలజిస్ట్ సాఫ్ట్‌వేర్‌లో చూసి, నివేదికలు ఇచ్చేవారు. తర్వాత దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని భావించినా ముందుకు సాగలేదు. ఆ సంస్థ ఈ ప్రాజెక్టును నాస్కామ్ సహకారంతో ఛండీగఢ్‌లో నిర్వహిస్తున్నారు.



పీహెచ్‌సీలో మైక్రోస్కోప్‌లో నమూనాలు పరీక్షిస్తున్న టెక్నీషియన్

కాఫీ పొడి తయారీ అద్భుతం

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన కాఫీ ఘుమఘుమలు అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం గెడ్డంపుట్టు గ్రామంలోని మన్య తోరణం రైతు ఉత్పత్తిదారుల కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. కాఫీ పండ్ల సేకరణ, పల్పింగ్, డ్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, కాఫీ పొడి తయారీ చూసి నిర్వాహకులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కాఫీ మార్కెటింగ్ విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గిరిజన కాఫీని ప్రమోట్ చేయడానికి 50 మంది గిరిజన యువకులకు శిక్షణ అందించాలని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తామన్నారు. ఏడీ రమేష్, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధి వెంకటరమణ, సర్పంచులు పాల్గొన్నారు.



గెడ్డంపుట్టులో కాఫీ పొడి తయారీ పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో ఏడీ రమేష్ తదితరులు

ఏటా పర్యాటక వారోత్సవాలు

రానున్న పర్యాటక సీజన్‌లో ముఖ్యమైన సందర్శక ప్రాంతాల్లో పర్యాటక వారోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ఏజెన్సీల్లో గిరిజన సంస్కృతి, సంప్రదాయం, వివిధ వస్తువుల అమ్మకాల స్టాల్స్, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డిసెంబర్ మొదటి వారంలో అరకు ఫెస్టివల్ నిర్వహణకు ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడేరు డివిజన్‌లో పది, రంపచోడవరంలో ఐదు ముఖ్యమైన పర్యాటక కేంద్రాలు గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రైవేట్ వాహనాల దందాకు చెక్

గుడిసె, వజ్ర జలపాతం తదితర పర్యాటక ప్రాంతాలకు సొంత వాహనాలను అనుమతించకుండా.. ప్రైవేటు వాహనదారులు అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారని, దానిని కట్టడి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్దిష్ట రుసుము ప్రకటించి, ఆ మొత్తానికే పర్యటకులను తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం డీఎఫ్‌ఓ రవీంద్రదామ, జిల్లా పర్యాటక అధికారి దాసు, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళీకృష్ణ, డీపీఓఆర్‌కే గోవిందరాజులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ఆరా

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ లెవెల్ మోనటరింగ్ బృందం ప్రతినిధి సుధాకర్ అన్నారు. గురువారం కొయ్యూరు, మర్రివాడ, బూదరాళ్ల పంచాయతీల్లో ఎన్ఎల్ఎం బృందం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరును పరిశీలించింది. సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలలకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించాలన్నారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే హెచ్ఎంకు తెలియజేయాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఏపీడీలు శ్రీనివాస్, లోకేష్, కొయ్యూరు సర్పంచి బాలరాజు, ఏపీఎం గాంధీ, ఏపీవోలు శ్రీనివాస్, రాజు, గృహనిర్మాణ సంస్థ ఏఈ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



కొయ్యూరులో మాట్లాడుతున్న ఎన్ఎల్ఎం ప్రతినిధి సుధాకర్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

రంపచోడవరం, న్యూస్‌టుడే: చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి బేస్‌లైన్ ఎసైన్‌మెంట్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బేస్‌లైన్ ఎసైన్‌మెంట్ టెస్ట్ నిర్వహణపై రిసోర్సుపర్సన్ల ద్వారా 174 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐటీడీఏ పీవో సింహాచలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. లెక్కలు, ఆంగ్లం అర్థమయ్యేరీతిలో బోధించాలన్నారు. ఈ శిక్షణలో ఏజెన్సీ డీఈవో పీ. మల్లేశ్వరరావు, ఎంఈవో రామకృష్ణ, రిసోర్సుపర్సన్లు సాయిబాబా, టాటాజీ, ఎమ్మార్సీలు పాల్గొన్నారు.




శిక్షణలో ఉపాధ్యాయులు

మెగా డీఎస్సీతో గిరిజనులకు ప్రయోజనమేది?

గూడెంకొత్తవీధి: మెగా డీఎస్సీతో గిరిజనులకు ప్రయోజనం లేదని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీకి కూటమి ప్రభుత్వం తొలి సంతకం చేసినా.. జీవో నం 3 పునరుద్ధరించకపోవడంతో గిరిజనులకు అవకాశాలు లేవన్నారు.

కాయలకు సంచులతో రక్ష



కాయలకు కవర్లు కడుతున్న రైతు

విత్తు మొదలు పంట చేతికొచ్చే వరకు సాగులో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనం వేశాక మొలకెత్తే వరకు, మొలక వచ్చాక మొక్కగా ఎదిగే వరకు, ఆపై ఫలసాయం చేతికొచ్చే వరకు రైతులు నిత్యం సస్యరక్షణ చర్యలు చేపడుతుంటారు. ఈ క్రమంలోనే కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామానికి చెందిన ఓ రైతు తోటలో కాపుకొచ్చిన జామ కాయలను రామచిలుకలు కొట్టకుండా రక్షణగా తెల్లని సంచులు కడుతున్నారు. ఇలా చేస్తే కాయ రాలిపోవడం పెద్దగా ఉండదని ఆ రైతు చెప్పారు.

– ఈనాడు, కె.కోటపాడు

ఆర్థిక ఇబ్బందులతో గంజాయి వ్యాపారం

హైదరాబాద్, న్యూస్‌టుడే: నగరంలో అవసరమైన వారికి గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం ఎస్సార్ నగర్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వెల్లడించారు. బల్కంపేట సమీపంలోని నేచర్‌క్యూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం సిర్లిమెట్ట గ్రామానికి చెందిన కిల్లో మాధవరావు(20), తూర్పుగోదావరి జిల్లా సిర్లబుర్లకు చెందిన మల్లుల రాకేష్(21)లు ఓ ద్విచక్ర వాహనంతో పట్టుపడ్డారు. వారి వద్ద 6 కిలోల 300 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను విచారించగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి వ్యాపారంలోకి దిగినట్లు వెల్లడించారు. నిందితులిద్దరూ గతంలో అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో సర్వెంట్లుగా పని చేశారు. మాధవరావు కొంతకాలం కిందట పనిమానేసి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఇటీవల తిరిగి వచ్చి ఎల్లారెడ్డిగూడలో ఉంటూ వేరే హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. నెలనెలా వాయిదాలకు డబ్బులు చాలకపోవడంతో అతను పని చేసేచోట మిత్రుడైన అలెక్స్, రాకేష్‌లను సంప్రదించాడు. అప్పటికే గంజాయి అలవాటున్న అలెక్స్ గంజాయి వ్యాపారం చేస్తే డబ్బు వస్తుందని చెప్పాడు. దీంతో మాధవరావు స్వగ్రామానికి వెళ్లి తన సోదరుడు కేశవరావు పండిస్తున్న గంజాయిని కొనుగోలు చేసి రైలులో నగరానికి తీసుకొచ్చాడు. మల్లుల రాకేష్‌తో కలిసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో పరారీలో ఉన్న అలెక్స్, గంజాయి పండిస్తున్న కేశవరావు కోసం గాలిస్తున్నారు.

ఆదివాసీ హక్కులకు భీం పోరాటం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన కుమురం భీం జయంతి వేడుకలను రింతాడలో మన్య పుత్ర యువజన సంఘం అధ్యక్షుడు, ఉప సర్పంచి మడపల సోమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భీం ఆశయాల సాధనకు ప్రతి గిరిజనుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నీరు, అడవి, భూమి కోసం వీరోచితంగా భీం పోరాడారని కొనియాడారు.



రింతాడలో భీం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గిరిజనులు

నూతన ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం ఎంపీడీవోగా పి.జి.రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన బి.శ్రీనివాసు ప్రకాశం జిల్లాకు బదిలీ కాగా.. దేవీపట్నంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న రామకృష్ణ గంగవరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఏవో సిద్దేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ నరసింహమూర్తి స్వాగతం పలికారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి ఎంపీడీవోగా నియమితులైన తూటిక శ్రీనివాస్ విశ్వనాథ్ గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి డీపీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎ.వి.రత్నకుమార్ వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.



మారేడుమిల్లి ఎంపీడీవో శ్రీనివాస్

ధరల నియంత్రణలో విఫలం

చింతపల్లి, న్యూస్‌టుడే: ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. గురువారం చింతపల్లిలో మూడు మండలాల పార్టీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. ధరలను నియంత్రిస్తామని ఎన్నికల్లో ప్రకటించిన నేతలు ఆ తరువాత వాటిని పట్టించుకోవడం లేదని చెప్పారు. అంపురంగి బుజ్జిబాబు, పాంగి ధనుంజై, సూరిబాబు పాల్గొన్నారు.

ఖోఖో ఎంపిక పోటీలు వాయిదా

అగనంపూడి, న్యూస్‌టుడే: గాజువాక శివారు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించాల్సిన ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు వాయిదా పడ్డాయి. వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

వరద బాధితుడికి వితరణ

చింతూరు, న్యూస్‌టుడే: ఇల్లు లేక ఇబ్బంది పడుతున్న కుమ్మూరుకు చెందిన కొర్సా దేశయ్యకు గురువారం ఇంటి నిర్మాణానికి అవసరమైన రేకులు, ఇనుప రాడ్లను ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ అందజేశారు. ఇటీవల వరదలకు ఇల్లు పాడైపోవడంతో నిర్మాణానికి కావల్సిన వస్తువులను అందజేశారు. తెదేపా నాయకులు అనికి చంద్రయ్య, విడియం నాగేశ్వరరావు, కుర్సం ప్రసాద్ పాల్గొన్నారు.



రేకులు అందజేస్తున్న జమాల్‌ఖాన్

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

రావికమతం, న్యూస్‌టుడే: టి.అర్జాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో ఆర్.శృతి, గిరిజ, భారతి, లక్ష్మీకుమారి, బాలుర విభాగంలో ఎస్.మహంత్, ఆర్.ప్రవీణ్‌కుమార్, జి.లోకేశ్, అండర్-17 బాలికల విభాగంలో ఎం.రుషిత, బాలుర విభాగంలో ఆర్.ప్రసాద్ ఎంపికయ్యారని పీఈటీ రమేష్‌నాయుడు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చోడవరం మండలం గోవాడ జడ్పీ పాఠశాలలో జరిగిన పోటీల్లో సత్తా చాటారన్నారు. అన్నమయ్య జిల్లా అంగులూరులో నవంబరు 6, 7 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్ఎం నాయుడు, సర్పంచి ఫాల్గుణ, వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, సీఆర్‌పీ రామారావు, స్కూలు కమిటీ ఛైర్మన్ పెంటారావు గురువారం అభినందించారు.

గృహనిర్మాణాలు వేగవంతం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ పథకంలో మంజూరైన గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా చొరవ చూపాలని గృహనిర్మాణ సంస్థ డీఈఈ రాజబాబు సిబ్బందికి సూచించారు. సుంకరమెట్ట పంచాయతీ సంగంవలసలో ఏఈ కాంతి, సర్పంచి చిన్నబాబులతో కలసి పర్యటించారు. ఇళ్ల నిర్మాణ పనుల్ని పరిశీలించారు. మండలంలో 2166 గృహాలు మంజూరు కాగా.. మొదటి విడతగా 1404, రెండో విడతలో 762 నిర్మాణాలు పూర్తిచేసేలా లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఏఈ మజ్జి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సంగంవలసలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈఈ రాజబాబు తదితరులు

గంజాయి జోలికి వెళ్లొద్దు

దేవీపట్నం, న్యూస్‌టుడే: యువత గంజాయి జోలికి వెళ్లొద్దని రంపచోడవరం సీఐ ఆర్‌జే.రవికుమార్ పేర్కొన్నారు. దేవీపట్నం మండలం కొండమొదలు ఆర్అండ్ఆర్ పునరావాస కాలనీలో గురువారం నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వన్య ప్రాణుల వేటకు విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసినా వాటిని ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి ప్రమాదాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ రుణాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎస్సై షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



కొండమొదలు పునరావాస కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

లోయలోకి దూసుకెళ్లిన కారు.. డ్రైవర్ మృతి

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయాలపాలయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా బోయిపరిగుడకు చెందిన నలుగురు యువకులు గురువారం డుడుమ జలపాతం సందర్శనకు వెళ్తున్నారు. వనుగుమ్మ పంచాయతీ అసరాడ, తర్లాగుడ మధ్యలో కారు అదుపుతప్పి 20 అడుగుల లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఉమాశంకర్ బుయ్యా (35), మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి లమతపుట్టులోని ఆశాకిరణ్ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఉమాశంకర్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. సిద్ధాంత్ మహంతికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



లోయలోకి దూసుకెళ్లిన కారు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు వీధులు శుభ్రం చేయించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణకు క్లాప్ మిత్రాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: రాజ్‌మా పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత ప్రదీప్‌కుమార్ అన్నారు. జి.మాడుగులలో రాజ్ పంట సాగును వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. పంటలో పురుగుల ఉద్ధృతిని నివారించాలని సూచించారు. ఏవో పాత్రుడు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వలిసెల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చని చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డా. అప్పలస్వామి తెలిపారు. దుచ్చరిపాలెంలో గురువారం గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త బాలహుసేన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి మధుసూధన్‌రావు పాల్గొన్నారు.



జి.మాడుగులలో రాజ్‌మా సాగుపై సూచనలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత ప్రదీప్‌కుమార్, సిబ్బంది

కొయ్యూరు, న్యూస్‌టుడే: మంప పంచాయతీ కించెవానిపాలెం, కొయ్యూరు రైతు సేవా కేంద్రాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కించెవానిపాలెంలో వరి పంటకు సోకిన తెగుళ్లను మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి, సర్పంచి త్రినాథమూర్తిపడాల్, తెదేపా నేత బి.శివరామరాజు, రైతులు పరిశీలించారు. ఉమాదేవి మాట్లాడుతూ.. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పశువైద్యాధికారి రాజేశ్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్‌డ్	213	250
స్కిన్‌లెస్	243	260

నదుల సంగమం.. నయనానందకరం



శబరి, గోదావరి నదుల సంగమం వద్ద ప్రకృతి అందాలు

తుపాను ప్రభావంతో ఏర్పడిన మేఘాలు మండలంలో అక్కడక్కడా చిరుజల్లులు కురిపించిన తరువాత శ్రీరామగిరి కొండలను తాకుతూ వెళ్లాయి. శబరి వారధిపై నుంచి వీక్షించిన వారికి శబరి, గోదావరి నదుల సంగమం మీదుగా గురువారం ఈ దృశ్యాలు కనువిందు చేశాయి.

– న్యూస్‌టుడే, వరరామచంద్రాపురం

బిల్లుల మంజూరుకు ఇబ్బందుల్లేవు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు, లోతుగెడ్డ సర్పంచి సునీల్

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ అధికారి రమణ అన్నారు. గురువారం లోతుగెడ్డ పంచాయతీ సర్పంచి చింతర్ల సునీల్‌తో కలసి పంచాయతీలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లుల మంజూరుకు ఎటువంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. శ్లాబ్ పూర్తి చేసినవారు మిగతా పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబూరావు, కూటమి నాయకులు అప్పారావు, రాఘవులు, నర్సింగరావు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మూర్తి, ఉపాధ్యాయులు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు గిరిజన సంక్షేమ బాలుర-2 పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కిల్లో చిరుత రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో విద్యార్థి రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయుడు మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు కామేశ్వరావు, ఉపాధ్యాయులు బాలుడిని అభినందించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అనంతగిరి, న్యూస్‌టుడే: అనంతగిరి, కాశీపట్నం సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ అప్పారావు తెలిపారు. నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల సమయంలో సరఫరా ఆపేస్తున్నట్లు పేర్కొన్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలంలో విద్యుత్తు లైన్ల వెంబడి ఉన్న చెట్లు, కొమ్మలు తొలగించే ప్రక్రియ (జంగిల్ క్లియరెన్సు) చేపడుతున్న కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు రంపచోడవరం విద్యుత్తు సంస్థ ఈఈ టి.గాబ్రియేల్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపేస్తామన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

చింతూరు, న్యూస్‌టుడే: ఆరోగ్య భారతి సంఘం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. విజయవాడలోని ఈ సంస్థ మండలంలోని ఎర్రంపేట కస్తూర్బా విద్యాలయంలోని 80 మంది విద్యార్థినులకు వీటిని అందజేశారు. అఖిల భారత ఆరోగ్య భారతి కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, చింతూరు సేవా భారతి వైద్యులు గంగాధర ప్రసాద్, ఆవుల సుబ్బారావు, పద్మావతి పాల్గొన్నారు.

శాస్త్రవేత్త నియామకం

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో పంటల శరీర ధర్మ (క్రాప్ ఫిజియాలజీ) శాస్త్రవేత్తగా డాక్టర్ డి.వెంకటేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన మహానంది వ్యవసాయ కళాశాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. చింతపల్లిలో శాస్త్రవేత్తగా పనిచేసిన డాక్టర్ ఉజ్వలారాణి రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు. పరిశోధనాస్థానంలో రాజ్‌మా, వలిశెల పంటలపై పరిశోధనలకు సంబంధించి నూతన శాస్త్రవేత్త సేవలు వినియోగించుకుంటామని ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

పాకలోనే పాఠాలు.. ఎన్నాళ్లీ పాట్లు!

రంపచోడవరం, న్యూస్‌టుడే



బడి నిర్వహిస్తున్న రేకుల షెడ్డు

రంపచోడవరం మండలం గోగుమిల్లి గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలో మూడు నుంచి అయిదో తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి పక్కా భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులోనే తరగతులను నిర్వహిస్తున్నారు. గట్టిగా వర్షం వస్తే చెంతనే ఉన్న అంగన్‌వాడీ భవనంలో తరగతులు నిర్వహిస్తుంటారు. గత ప్రభుత్వం పాఠశాలలకు అదనపు తరగతి గదులు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించింది. రంపచోడవరం మండలం గోగుమిల్లి, పందిరిమామిడి, పందిరివీధి గ్రామాలకు నాలుగేళ్ల క్రితం నాడు-నేడు కింద పక్కా భవన నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఒక్కో భవనానికి రూ.35 లక్షలను విడుదల చేసింది. గోగుమిల్లిలో భవన నిర్మాణ పనులు చేపట్టి నాలుగేళ్లు దాటినా ఐటీడీఏ, పీఆర్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో నేటికి పూర్తికాలేదు. దీంతో రేకుల షెడ్లలో, పూరిపాకల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ రామకృష్ణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా నిధుల విడుదలకాక భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందన్నారు. నిధుల విడుదలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.



గోగుమిల్లిలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనం

పాఠశాల ఆవరణలో శిథిల భవనం...

రంపచోడవరం, న్యూస్‌టుడే

బందపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల భవనంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 215 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం ఆరేళ్ల క్రితం పూర్తిగా శిథిలమైంది. దీంతో ఆవరణలోనే కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించారు. కొత్తభవనంలోకి తరగతులను మార్చారు కాని.. శిథిలమైన పాత భవనాన్ని తొలగించలేదు. దీంతో భవనం ఎప్పుడు కూలిపోతుందో...ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాత భవనాన్ని తొలగించాలని గిరిజన సంక్షేమశాఖ (విద్య) అధికారులకు హెచ్‌ఎం, వార్డెన్లు పలుమార్లు విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. శిథిలమైన ఈ భవనాన్ని వెంటనే తొలగిస్తే ప్రమాదం తప్పడంతో పాటు క్రీడామైదానానికి అనువుగా ఉంటుంది. గిరిజన సంక్షేమశాఖ (విద్య) అధికారులు చర్యలు చేపట్టి శిథిలమైన భవనాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయశాంతి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి శిథిల భవనాన్ని తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.



అ వీ ఇ వీ

వర్షంతో జనజీవనానికి ఆటంకం

గూడెంకొత్తవీధి, అనంతగిరి, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో గూడెంకొత్తవీధి మండలంలో గురువారం తెరిపిలేకుండా వర్షం కురిసింది. మండల కేంద్రం సహా ఆర్వీనగర్, పారికల, పనసపల్లి, బోనంగిపల్లి, దేవరాపల్లి, లకవరపుపేట ప్రాంతాల్లోని కాలువలు పొంగి ప్రవహించాయి. గూడెంకొత్తవీధి వారపుసంతలో క్రయవిక్రయాలకు ఆటంకం ఏర్పడింది. గిరిజనులు గ్రామాల నుంచి బయటకు రాలేకపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అనంతగిరి మండలం డముకు, ములియగుడ, కాశీపట్నం, చిలకలగెడ్డ తదితర గ్రామాల్లో కురిసిన భారీ వానకు రహదారిపైకి నీరు చేరింది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గంగవరం, న్యూస్‌టుడే: గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. స్థానిక ఎస్బీఐకి వచ్చిన పలువురు ఖాతాదారులు వర్షంలో తడుస్తూ వెళ్లారు. సుమారు రెండు గంటలపాటు భారీ వర్షంపడగా మండల కేంద్రంలోని పలు కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వైద్యకళాశాలకు మల్లుదొర పేరు పెట్టాలి

కొయ్యూరు, న్యూస్‌టుడే: పాడేరులోని వైద్య కళాశాలకు స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర పేరు పెట్టాలని భారతీయ ఆదివాసుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గడుతూరి రామలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ స్వాతంత్ర్య పోరులో అల్లూరి సీతారామరాజుకు ముఖ్య అనుచరుడిగా ఉండి, పలు పోరాటాల్లో మల్లుదొర పాల్గొన్నారని పేర్కొన్నారు. బ్రిటిష్ సేనలకు పట్టుబడి అండమాన్ జైలులో ఉన్నారన్నారు.

స్మార్ట్‌మీటర్లతో అధిక బిల్లులు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటర్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలకు ప్రజలంతా సహకరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న స్మార్ట్ మీటర్లతో అధిక విద్యుత్తు బిల్లులు వస్తాయన్నారు. ఈ సమస్యపై శుక్రవారం సబ్‌స్టేషన్లను ముట్టడిస్తామన్నారు. పులి సంతోశ్, ప్రదీప్, చిన్నబాబు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ మండలం పిత్తగుడ గ్రామంలో ఎలుగుబంటి దాడి ఘటనలో గాయపడ్డ బాధితులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఎం నాయకులు రామారావు అన్నారు. బుధవారం అరకులోయ ఆసుపత్రిలో బాధితుల్ని పరామర్శించారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పీవో తదితరులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో పీవో కట్టా సింహాచలం, గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రంప గ్రామంలో సర్పంచి మంగా బొజ్జయ్య, ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి వాల్మీకి విగ్రహానికి నివాళులు అర్పించారు. జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె నారాయణ, సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు దూడ స్మిత్, సంఘ నాయకులు జల్లి సుందర్‌బాబు తమ్మన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్ అన్నారు. వేటమామిడిలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అడ్డతీగల వాల్మీకినగర్‌లో ఆ సంఘం మండల అధ్యక్షుడు బొండ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎస్సై వినోద్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో ఆదివాసీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో 'వనవాసీ' స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్‌కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్లె అనిల్‌ప్రసాద్, వార్డు సభ్యుడు నల్లమిల్లి సుబ్బారెడ్డి, కంబం విజయ్‌వాల్మీకి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.శ్రీనివాస్‌విశ్వనాథ్, ఈవోపీఆర్డీ విజయ్‌కుమార్ వేడుకల్లో పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో ప్రతిభ గిరిజన యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ముఖ్య సలహాదారుడు వజ్రపు చిన్నబ్బాయి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు, ప్రతిభ గిరిజన యువశక్తి సంఘం సలహాదారులు వి.అప్పారావు, వి.రాజబాబు, బి.శ్రీను పాల్గొన్నారు.

చింతపల్లి, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో వాల్మీకి జయంతి వేడుకలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు నిర్వహించారు. ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి, శాస్త్రవేత్తలు బయ్యపురెడ్డి, బాలహుస్సేన్ రెడ్డి, జోగారావు పాల్గొన్నారు. జీకేవీధిలో జనసేన మండల ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్‌మార్క్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నేతలు రీమల రాజేశ్వరి, ముక్కలి మహేష్ పాల్గొన్నారు.

గంగవరం, చింతూరు, న్యూస్‌టుడే: బ్రహ్మమామిడిలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు. గంగవరంలో జనసేన మండలాధ్యక్షుడు కుంజం సిద్ధు, వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొర్లె రాజుబాబు, సన్యాసిరావు పాల్గొన్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో పీవో అపూర్వ భరత్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేశారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు విజయలక్ష్మి, నాగబాబు, అనికుమారి, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి వ్యవసాయ పరిశోధనాస్థానంలో..



వేటమామిడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

విస్తరించినా అవే అవస్థలు



పెదబయలులో రహదారి విస్తరణ అస్తవ్యస్తంగా జరగడంతో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. రెండులైన్ల రోడ్డు ఉన్నప్పటికీ పుట్‌పాత్ సక్రమంగా లేకపోవడంతో వాహనాలు ఇష్టానుసారం నిలిపేస్తున్నారు. పలుచోట్ల దుకాణాలు ముందుకొచ్చేయడం, పుట్‌పాత్ లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వాహనాల రాకపోకల సమయంలో ఈ కష్టాలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. రెండువైపులా పుట్‌పాత్‌కు అవకాశం ఉండేలా విస్తరణ చేపడితే ఈ సమస్య ఉండదని పలువురు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

– పెదబయలు, న్యూస్‌టుడే

తగ్గిన పర్యటకుల తాకిడి

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలో పర్యటకుల సంఖ్య క్రమంగా తగ్గింది. దసరా సెలవులు పూర్తి కావడంతో సందర్శకులు అంతంతమాత్రంగానే వస్తున్నారు. పర్యటకులు లేకపోవడంతో గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం, కాఫీ తోటలు తదితరాలు బోసిబోతున్నాయి.

చట్టాలపై అవగాహన అవసరం



గూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

హుకుంపేట, న్యూస్‌టుడే: మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ సన్యాసినాయుడు పేర్కొన్నారు. గూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో సంకల్పం కార్యక్రమం గురువారం నిర్వహించారు. నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ నేరాల నియంత్రణపై మాట్లాడారు. బాగా చదువుకోవాలని సూచించారు. వంట గది, సరకులు పరిశీలించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమాజంలో యువత వ్యసనాలను విడనాడి ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాలను సాధించాలని సీఐ రవికుమార్ పిలుపునిచ్చారు. సోకులగూడెంలో గురువారం గంజాయి, సారా తదితర మత్తు పదార్థాల నిర్మూలనపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్సై సాధిక్, పోలీసు సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.



సోకులగూడెం సదస్సులో మాట్లాడుతున్న సీఐ రవికుమార్, పక్కన ఎస్సై సాధిక్

22 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఈనెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. దారకొండ, జీకే వీధి 1, మొండిగెడ్డ, రింతాడ 1, లకవరపుపేట, సంకాడ పంచాయతీ కేంద్రాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

రేఖపల్లి కూడల్లో మద్యం దుకాణం వద్దు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రేఖపల్లి ప్రధాన కూడలికి దగ్గరలో గిరిజన దేవాలయం ఉన్నందున, అక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని గ్రామస్థులు చిక్కాల బాలు, వీర్ల నాగేశ్వరరావు తదితరులు రెవెన్యూ అధికారులకు గురువారం వినతిపత్రం అందించారు. ఇక్కడకు దగ్గర్లో ఆటలస్థలం ఉందని, మద్యం దుకాణం ఏర్పాటుచేస్తే ఆటగాళ్లకు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. రాములు, రాజులు, ముత్యాలరావు, భవానిశంకర్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

గంగవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయాల సిబ్బంది కృషిచేయాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం లక్కొండ సచివాలయాన్ని సందర్శించి దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అదించాలన్నారు. కొత్త పింఛన్ల దరఖాస్తులను స్వీకరించి జనవరి నాటికి అందించేందుకు స్బిందికి కృషిచేయాలన్నారు. తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్, ఎస్సై డి.భూషణం, జనసేన మండలాధ్యక్షుడు కుంజం సిద్ధు, ఉపాధ్యక్షుడు గవరాజు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు ప్రయాణంలో అప్రమత్తం

అనంతగిరి, న్యూస్‌టుడే: మన్యానికి వచ్చే పర్యటకులు ఘాట్ రోడ్డు ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ హిమగిరి అన్నారు. ములియగుడ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలన్నింటికీ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. రికార్డులు లేకుండా ప్రయాణిస్తే వాహనాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు. పర్యటకులకు ఘాట్‌రోడ్డుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దన్నారు. ఎస్సై శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై తదితరులు



దళారులను నమ్మి మోసపోవద్దు



సదస్సుకు హాజరైన రైతులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: కాఫీ రైతులు పంట కోత, మార్కెటింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ కాఫీ విభాగం ఏఈవో అప్పలనాయుడు పేర్కొన్నారు. దొడ్డిపలి, బొర్రమామిడి గ్రామాల్లో కాఫీ విభాగం, జీసీసీ ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీసీసీ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఏఈవో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అపెక్సు కమిటీ కాఫీ పార్చిమెంట్, చెర్రీ ధరలను ప్రకటించిందని పేర్కొన్నారు. దళారులకు పంట విక్రయించి మోసపోవద్దన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో కాఫీ పండ్లను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పంట ఆరబెట్టేందుకు టార్పాలిన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచి రంగమ్మ, జీసీసీ, ఐటీడీఏ కాఫీ విభాగం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే:

?: పెదగెద్దాడ గ్రామంలో తాగునీటి పథకం మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. సంబంధిత అధికారులు తాగునీరు అందరికి అందేటట్టు చర్యలు చేపట్టాలి.

–గుర్రం ప్రసాద్, పెదగెద్దాడ గ్రామం

✓: రంపచోడవరం మండలం పెదగెద్దాడ గ్రామంలో మంచినీటి విభాగానికి మరమ్మతులను చేపట్టి తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకొంటాం.

–సుండం శ్రీనువాసుదొర, ఎంపీడీవో, రంపచోడవరం.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కోసం గతంలో నిర్మించిన నివాసగృహాలు శిథిలస్థితికి చేరాయి. ప్రస్తుతం అవి సిబ్బంది నివాసాలకు అనుకూలంగా లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి.

– రమణారెడ్డి, మారేడుమిల్లి

✓: ఈ నివాసగృహాలకు అవసరమైన మరమ్మతులు చేయడానికి తగిన చర్యలు చేపడతాం. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం.

– డాక్టర్ వై.హరికృష్ణ, వైద్యాధికారి, మారేడుమిల్లి పీహెచ్‌సీ



పల్లె పండగతో అభివృద్ధి వెలుగులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు కనిపిస్తున్నాయని తెదేపా మండల అధ్యక్షులు బలరామ్ అన్నారు. గురువారం వనబసింగి పంచాయతీలోని కొత్తూరులో భూమి అభివృద్ధి పనులకు ఎంపీడీఓ శ్రీసాయిహర్షతో కలసి శంకుస్థాపన చేశారు. సర్పంచి లక్ష్మణ్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, పెదబయలు, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల అభివృద్ధిలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములవ్వాలని అరకులోయ నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి దొన్నుదొర అన్నారు. కంద్రుం పంచాయతీ కేంద్రంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, ఉప ఎంపీపీ ఆనందరావు, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు. గోమంగి, పొయిపల్లి, గుల్లెలు, లింగేటి, బొండాపల్లి పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఏపీవో అప్పలనాయుడు పాల్గొన్నారు.



మొండిగెడ్డలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచి ప్రియాంక

కూనవరం, న్యూస్‌టుడే: కూటూరు, పెదార్కూరులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. సర్పంచులు బొగ్గా వెంకమ్మ, పాయం నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు అమ్మాజీ, కన్నారావు పాల్గొన్నారు.

జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కోరాపల్లి పంచాయతీ అరగడపల్లిలో గోశాల నిర్మాణ పనులు ప్రారంభించారు. కూటమి నాయకులు శ్రీనివాసనాయుడు, ఆర్.కొండబాబు, పెదబాలన్న పాల్గొన్నారు. మొండిగెడ్డలో సర్పంచి అడపా ప్రియాంక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నేతలు విష్ణుమూర్తి, సత్తిబాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పుల్లంగిలో గోకులం షెడ్ల నిర్మాణానికి సర్పంచి వీరవల్లి జార్జిబాబు భూమిపూజ చేశారు. సచివాలయ కార్యదర్శి డి.కిశోర్‌బాబు పాల్గొన్నారు.

కొయ్యూరు, అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెంలోని శ్మశానవాటికకు వెళ్లేదారిలో రూ.తొమ్మిది లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ రమేష్ బాబు, సర్పంచి సింహాచలం గురువారం ప్రారంభించారు. కొయ్యూరులో ఇంకుడు గుంతల తవ్వకాలను సర్పంచి మాకాడ బాలరాజు ప్రారంభించారు. నేతలు దొరబాబు, వరహాలబాబు, ఖాన్, వీరయ్యదొర, చక్రరావు, జి.లక్ష్మణ్, ఎస్.బుజ్జిబాబు పాల్గొన్నారు.



పుల్లంగిలో గోకులం షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచి

★ గన్నెల, ఇరగాయి, లోతేరు పంచాయతీల్లో పల్లె పండగలో భాగంగా రోడ్డు పనులు ప్రారంభించినట్లు నిర్వహించినట్లు ఎంపీడీఓ లవరాజు తెలిపారు.

ఎటపాక, న్యూస్‌టుడే: లక్ష్మీపురం గ్రామంలో మంజూరైన అభివృద్ధి పనులకు తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కణితి మధు భూమిపూజ చేశారు. జనసేన మండల ఉపాధ్యక్షుడు మొల సతీశ్, సర్పంచ్ సరోజిని పాల్గొన్నారు.